ప్రజాశక్తి

శ్రీ సత్యసాయి జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్‌ను అనంతపురంలో గృహ నిర్బంధం చేసిన పోలీసులు

అనంతపురంలో మట్టితింటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

మట్టి తిని బతకాలా..?

◆ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన అంగన్‌వాడీలు

◆ జిల్లా వ్యాప్తంగా 36వ రోజు కొనసాగిన సమ్మె

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'నిత్యావసరాల ధరలు పెరిగాయి.. ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, ఆరోగ్యం, వంటి అనేక సమస్యలు ఉన్నాయి.. ఈ సమస్యలు తీరాలంటే కనీస వేతనాలు అవసరం. ఏళ్ల తరబడి పని చేస్తున్నాం. మాకు కనీస వేతనాలు ఇవ్వకపోతే మట్టి తిని బతమంటారా..?' అంటూ అంగన్‌వాడీ కార్మికులు నిరసన తెలిపారు. న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 36వ రోజుకు చేరుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో అంగన్‌వాడీలు వినూత్న పద్ధతుల్లో ప్రభుత్వానికి నిరసన తెలిపారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన 24 గంటల రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. ఒక్కొక్క డివిజన్ నుంచి ఒక్కొక్క రోజు 12 చొప్పున 24 గంటల రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మండుటెండలో శిబిరంలో బైటాయించి ఆందోళన కొనసాగించారు. పండుగ రోజు అని కూడా లేకుండా హక్కుల సాధన కోసం రోడ్లెక్కాల్సిన పరిస్థితి వచ్చిందంటూ అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కార్మికుల యూనియన్ జిల్లా కోశాధికారి జమన అధ్యక్షతన నిర్వహించిన దీక్షలకు సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా, జిల్లా ఉపాధ్యక్షుడు మన్నీల రామాంజినేయులు మద్దతుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీల పట్ల అనుసరిస్తున్న వైఖరి దుర్మార్గంగా ఉందన్నారు. 36 రోజులుగా సమ్మె చేస్తుంటే చర్చల పేరుతో కాలయాపన చేయడం అన్యాయంగా ఉందన్నారు. ఆర్థికేతర అంశాలపై మాట్లాడేందుకు చర్చలకు పిలవడం ప్రభుత్వం దగాకోరు తనానికి నిదర్శనం అన్నారు. ఆర్థికపరమైన డిమాండ్‌లతో సమ్మె చేస్తుంటే అది కాకుండా ఇతర సమస్యలను పరిష్కరిస్తామంటూ చెప్పడం సరికాదన్నారు. తక్షణమే వేతనాలు పెంపుదల చేసి కార్మికుల సమ్మెను విరమింపజేయాలని కోరారు.

దీక్షా శిబిరానికి నిప్పు పెట్టిన దుండగులు

కాలిపోయిన శ్యామియానా...

అంగన్‌వాడీలు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె సందర్భంగా శామియానాతో శిబిరం ఏర్పాటు చేశారు. 24 గంటలు దీక్షలు చేపడుతుండటంతో రాత్రిపూట కూడా కార్మికులు అక్కడే నిద్రిస్తున్నారు. సోమవారం పండుగ రోజు కావడంతో కార్మికులు ఇళ్లకు వెళ్లిపోయారు. 36 రోజులుగా సమ్మె చేస్తున్న నేపథ్యంలో శామియానా తొలగించకుండా అలాగే ఉంచుతున్నారు. గుర్తు తెలియని దుండగులు శ్యామియానాపై నిప్పు పెట్టి తగలబెట్టారు. మొత్తం నాలుగు శ్యామియానాలు ఉండగా ఒక్క శామియానా పూర్తిగా కాలిపోయింది. కాలుతున్న సమయంలో అగ్ని మంటలు చెలరేగడంతో అటుగా వెళుతున్న వారు గమనించి మంటలు ఆర్పేశారు. దీంతో ప్రమాదం తప్పింది. కలెక్టరేట్ ఎదుట నిత్యం వాహన రాకపోకలతో రద్దీగా ఉండే ప్రాంతం. అలాంటి చోట ఇలాంటి సంఘటన జరగడంపై పలు అనుమానాలు తలెత్తాయి. కార్మికుల సమ్మెపై విషం చిమ్మడానికి ఎవరైనా చేశారా.. ఆకతాయిలు చేశారా..? అన్న అనుమానాలను కార్మికులు వ్యక్తం చేశారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం నిరసనలు తెలుపుతున్న తమపై ఇలాంటి దాడులు చేసి, మరింత ఆరింత ఆర్థిక భారం పడేలా చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు.

'నాసిన్' ప్రారంభం

◆ పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

◆ కట్టుదిట్టమైన భద్రత నడుమ సాగిన పర్యటన

◆ లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన ప్రధాని

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

విభజన హామీల్లో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు మంజూరు చేసిన 'నాసిన్' (నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇన్‌డైరెక్టు ట్యాక్స్ అండ్ నార్కోటిక్స్)ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మంగళవారం ప్రారంభించారు. 2015 ఏప్రిల్ నెలలో అప్పటి ఆర్థిక శాఖమంత్రి అరుణ్ జైట్లీ దీనికి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఈ ప్రాజెక్టు పనులు నత్తనడకన నడుస్తూ ఇప్పటికీ పూర్తయ్యాయి. సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద 500 ఎకరాల్లో చేపట్టిన ఈ అకాడమీలో ఐఆర్ఎస్ మొదులుకుని ఇతర వాణిజ్య, వ్యాపార విభాగానికి చెందిన ఉద్యోగులకు శిక్షణని ఇస్తారు. ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సంబంధంచి ప్రధాని మంగళవారం నాడు విచ్చేశారు. ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి పుట్టపర్తికి చేరుకున్న మోడీ మొదట లేపాక్షిలోని వీరభద్ర స్వామి దేవాలయాన్ని సందర్శించారు. అక్కడ ప్రత్యేక పూజలు చేయించి, శిల్ప కళావైభవాన్ని తిలకించారు. అనంతరం మధ్యాహ్నం పాలసముద్రం చేరుకుని నాసిన్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇన్‌డైరెక్టు ట్యాక్స్ అండ్ కస్టమ్స్ ఛైర్మన్ సంజయ్ కుమార్ అగర్వాల్, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ సత్యసాయిబాబా, స్వాతంత్ర్య సమరయోధులు కల్లూరు సుబ్బారావు వంటి మహనీయులు పట్టిన ప్రాంతానికి రావడం ఆనందంగా ఉందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈ క్యాంపస్‌లో శిక్షణ పొందిన వారిని కలిసినట్టు ఆయన తెలిపారు. వాణిజ్య, వ్యాపారాభివృద్ధిలో నాసిన్ కీలకంగా పనిచేయాలని సూచించారు. 2014 నుంచి ఇప్పటికి పన్నుల విధానంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని వివరించారు. అంతకు మునుపు పన్నుల విధానం చాలా సంక్లిష్టంగా ఉండేదన్నారు. జీఎస్టీని తీసుకొచ్చి మరింత సరళతరం, సులభతరం చేసామన్నారు. తద్వారా ప్రభుత్వ ఆదాయం పెరిగిందన్నారు. పెరిగిన ఆదాయాన్ని ప్రజల అభ్యున్నతికి ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. తద్వారా పేదరికం దేశంలో తగ్గుతోందన్నారు. గడిచిన తొమ్మిదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటకొచ్చారన్నారు. ప్రభుత్వం చేస్తున్నదల్లా, పేదవారికి అవసరమైన సహకారం, తోడ్పాటు అన్నారు. అదే రకంగా అనర్హులను పది కోట్ల మందిని తొలగించినట్లు చెప్పారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరైనా పాల్పడినా ఉపేక్షించడం లేదని చెప్పారు. సత్యసాయి జిల్లా వంటి వెనుకబడిన ప్రాంతంలో నాసిన్ ఏర్పాటు చేయడం హర్షనీయమని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.

నాసిన్‌లో శిక్షణ పొందినవారితో ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ

ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

కట్టుదిట్టమైన భద్రత

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సత్యసాయి జిల్లాకు వస్తున్న సందర్భంగా రెండు రోజులుగా జిల్లాలో పోలీసు భద్రత కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేశారు. పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించారు. పాలసముద్రం చుట్టుపక్కల మొత్తం పోలీసు పహారాను ఏర్పాటు చేశారు. ముందుగా అనుమతి ఉన్న వారిని మాత్రమే నాసిన్‌లోకి అనుమతించారు.

రైతులకు న్యాయం చేయమంటే అరెస్టులా..?

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో నాసిన్, బెల్ కంపెనీల ఏర్పాటుతో భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయమని అడిగేందుకు వెళ్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులను అరెస్టులు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్యని సిపిఎం శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ తెలిపారు. గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామం వద్ద నాసిన్ భవనాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి కలిసేందుకు సిపిఎం నాయకులు వెళ్లకుండా సోమవారం రాత్రి నుంచే ఎక్కడికక్కడ అరెస్టులు జరిగాయి. గోరంట్ల, సోమందేపల్లి, మడకశిర, చిలమత్తూరు తదితర ప్రాంతాల్లో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు చేశారు. ఇంతియాజ్‌తో పాటు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పెద్దన్న, ఉపాధ్యక్షులు గంగాధర్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, ఉపాధ్యక్షులు కొండ వెంకటేష్, తదితరులను అరెస్టు చేసి జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. ప్రధాని పర్యటన ముగిసేంత వరకు వారిని స్టేషన్లలో ఉంచుకుని అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని నాసిన్ అకాడమీకి 503 ఎకరాలు, బెల్ సంస్థకు 600 ఎకరాల భూమిని ప్రభుత్వం రైతులు నుంచి బలవంతంగా తీసుకుందన్నారు. గోరంట్ల, సోమందేపల్లి, మండలాలకు చెందిన దాదాపు 200 కుటుంబాలు భూములు కోల్పోయి జీవనాధారం కోల్పోయారని చెప్పారు. వీరికి సరైన పరిహారం ఇప్పటి వరకు అందలేదన్నారు. భూములు కోల్పోయిన వారిలో పేద దళితులే అధికంగా ఉన్నారన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములు కోల్పోయిన రైతులకు పట్టా, డిసి అనే వ్యత్యాసం చూడకుండా సమాన పరిహారం ఇవ్వాలనే జీవో ఉందన్నారు. దీనికి విరుద్ధంగా ప్రభుత్వం దళిత రైతులకు వివక్ష చూపి పరిహారంగా చాలా తక్కువగా ఇచ్చారన్నారు. దళిత రైతులకు రూ.2.45 లక్షలు ఇచ్చి, పెత్తందారులకు మాత్రం రూ.10 లక్షల పరిహారం ఇచ్చారన్నారు. ఒకే ప్రాంతంలోని భూములకు ఇలా వేర్వేరు విభాగాల మాదిర పరిహారం ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ విషయంలో బాధిత రైతులకు న్యాయం చేయాలని అనేకమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రాలు ఇచ్చామన్నారు. అయినా ఎవరూ స్పందించలేదన్నారు. భూములిచ్చిన రైతుల కుటుంబంలో ఒకరికి వారి విద్యార్హతను బట్టి ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. నాసిన్ అధికారులు టెండర్ రూపంలో ఇతర రాష్ట్రం వారికి ఉద్యోగాలు ఇస్తున్నారే కానీ భూములిచ్చిన రైతులకు మాత్రం అవకాశం ఇవ్వడం లేదన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నికలు సమీపిస్తుండడంతో వారి వ్యక్తిగత స్వలాభం కోసం కనీసం 50 శాతం కూడా పూర్తికాని నాసిన్ భవనాలను ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. ఈ సమస్యలన్నింటినీ సిపిఎం, ప్రజాసంఘాల నేతలు ప్రశ్నిస్తారన్న కారణంతోనే ఎక్కడికక్కడ జిల్లాలో పోలీసుల చేత ముందస్తు అరెస్టులు చేయించారన్నారు. అరెస్టులతో పేదల గొంతునొక్కలేరని వారి పక్షాన సిపిఎం పోరాటం చేస్తూనే ఉంటుందని ఇంతియాజ్ తెలిపారు.

కార్మికులు ఏకం కావాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. రాంభూపాల్-లెనిన్ శత వర్ధంతి పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

లెనిన్ శత వర్ధంతి పుస్కకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

అసమాన వ్యవస్థను మార్చేందుకు కార్మికులంతా ఏకం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో లెనిన్ శత వర్ధంతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21న ప్రపంచ వ్యాప్తంగా లెనిల్ శత వర్ధంతిని నిర్వహించుకోనున్నట్లు తెలిపారు. పెట్టుబడిదారీ వ్యవస్థ కొద్దిమందిని మాత్రమే సంపన్నులుగా చేస్తుందని, అత్యధిక మందిని పేదరికం దారిద్ర్యంలో ముంచుతుందని మార్క్సిజం బోధించిందన్నారు. ఈనేపథ్యంలో అసమాన వ్యవస్థను మార్చేందుకు ప్రపంచ కార్మికులంతా ఏకం కావాలని కార్ల్‌మార్క్స్ పిలుపునివ్వగా, లెనిన్ రష్యాలో అలాంటి సోషలిజాన్ని నిర్మించి మార్క్సిజం సిద్ధాంతం మాత్రమే కాదని ఆచరణకు మార్గదర్శని రుజువు చేశారని గుర్తు చేశారు. భారతదేశంలో ఆదాని అంబానీల ఆస్తులు ప్రపంచ కుబేరుల స్థాయికి పెరగగా, ప్రజలు మాత్రం ఆకలి, నిరుద్యోగంతో కునారిల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ ఆకలి సూచికలో దేశం 129వ స్థానానికి దిగజారడం ఇందుకు నిదర్శనమన్నారు. అధికార రాజకీయ పార్టీలను మార్చడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, సమాజాన్ని సమూలంగా మార్చడమే అంతిమ పరిష్కారం అన్నారు. ఇందుకు సోషలిజమే సరైన మార్గం అని అభిప్రాయపడ్డారు. ఆ మార్గాన్ని అనుసరించడానికి, మార్క్సిజం సిద్ధాంతాన్ని లోతుగా అధ్యయనం చేయడానికి ఇది సరైన సందర్భం అన్నారు. కావున లెనిన్ చూపిన మార్గంలో నడిచి దేశంలో సోషలిస్టు వ్యవస్థ నిర్మించేందుకు కష్టజీవులందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాల రంగయ్య, వి.సావిత్రి, ఎస్.నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో జనం తిప్పలు

సెల్ఫీ ఛాలెంజ్‌లో మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

విద్యుత్ ఉపకేంద్రం ముందు సెల్ఫీ దిగుతున్న కాలవ శ్రీనివాసులు

టిడిపి పాలనలో నియోజకవర్గంలో ఏడు విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసి లోవోల్టేజీ సమస్యను పరిష్కరిస్తే.. వైసిపి అధికారంలోకి వచ్చాక అప్రకటిత విద్యుత్ కోతలతో జనాన్ని తిప్పలు పెడుతోందని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు విమర్శించారు. సెల్ఫీ ఛాలెంజిలో భాగంగా డి.హీరేహాల్ మండలంలోని ఓబుళాపురం గ్రామంలో టిడిపి హయాంలో నిర్మించిన 132/33 కెవి సబ్‌స్టేషన్ వద్ద సెల్ఫీ తీసుకుని వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాకమునుపు కరెంటు సరఫరా ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి అన్నారు. అంతేగాకుండా వ్యవసాయ బోర్లు కాలిపోయి రైతులు ఆర్థికంగా నష్టపోయేవారన్నారు. పట్టణంలో గార్మెంట్స్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. అయితే టిడిపి అధికారంలోకి వచ్చాక తాను ఒక నిర్దిష్ట ప్రణాళికతో రైతులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా సామర్థ్యాన్ని పెంచడంతోపాటు అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. 20 సంవత్సరాల పాటు రాయదుర్గంలో లోవోల్టేజీ సమస్య రాకుండా ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. అయితే నాలుగున్నరేళ్ల వైసిపి ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

శింగనమల నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం బహిరంగ లేఖ

ప్రజాశక్తి-నార్పల

శింగనమల నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో ప్రభుత్వానికి బహిరంగ లేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్య, వైద్య, మౌలిక సదుపాయాలు, ఉపాధి, వ్యవసాయం, పాడి పరిశ్రమల అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నా పట్టించుకునే నాయకుడే లేకుండా పోయాడన్నారు. ఆయా వనరులపై సిపిఎం ఆధ్వర్యంలో ఇప్పటికే మండల, నియోజకవర్గ సదస్సులు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించడంతోపాటు, అధికారులకు విజ్ఞప్తులు ఇస్తూ, వివిధ రూపాల్లో ఉద్యమాలు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా గురుకుల పాఠశాలల్లో కాస్మొటిక్ ఛార్జీలు, నోట్ పుస్తకాలు, ఇతర సదుపాయాలకు నిధులు కేటాయించాలని, జూనియర్ కళాశాలల్లో బైపిసి, ఎంపిసి గ్రూపులను, ఇంగ్లీషు మీడియంను ప్రవేశపెట్టాలని, మోడల్ పాఠశాలలు లేని చోట ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలానికీ ఇండోర్ స్టేడియం, ఐటిఐలను ఏర్పాటు చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, వైద్యులను నియమించాలని, అంబేద్కర్ భవనాలకు స్థలాలు కేటాయించాలని, పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయాలని, చేనేత పార్కును ఏర్పాటు చేసి కార్మికులకు ముడి సరుకు సబ్సిడీపై ఇవ్వాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు, కూలి మగ్గంపై పని చేసే కార్మికులకు సొంత మగ్గం ఇవ్వాలని, మంచినీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని, పెనకచెర్ల డ్యాం నుంచి బైపాస్ కాలువ పనులు చెపట్టాలని, శింగనమల మండలం సలకంచెరువుకు హెచ్ఎల్‌సి నీళ్లు ఇవ్వాలని, చాగల్లు రిజర్వాయర్ ముంపు బాధితులకు పరిహారం ఇవ్వాలని, డోలమైట్, బ్లాక్ గ్రానైట్, వైట్ గ్రానైట్ ఖనిజాల ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు అనేక సమస్యలను ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఎం.కృష్ణమూర్తి, తరిమెల నాగరాజు, శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, గార్లదిన్నె, యల్లనూరు మండలాల కార్యదర్శు ఎస్.భాస్కర్, ఆర్.కుళ్లాయప్ప, కె.కుళ్లాయప్ప, సూరి, చెన్నారెడ్డి, ఓబులేసు పాల్గొన్నారు.

నేడు జయహో బీసీ సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభాకర్‌చౌదరి

నేడు నగరంలో నిర్వహించనున్న బయహో బిసి సదస్సును జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి పిలుపునిచ్చారు. ఈమేరకు నేడు నగరంలోని 5వ రోడ్డులోని సాయిబాబా ఆలయం వద్ద నిర్వహించనున్న బిసి సదస్సు వేదికతోపాటు 18న ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించే లలిత కళాపరిషత్‌లో వేదిక, 20న గుత్తి రోడ్డులోని జికెఎం ఫంక్షన్ హాలులో నిర్వహించే ముస్లిం మౌనారిటీ సదస్సు వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపితోనే బిసిల అభివృద్ధి సాధ్యమన్నారు. ఇందులో భాగంగా 'భవిష్యత్తుకు గ్యారెంటీ'లో బీసీల రక్షణ చట్టం తెచ్చేందుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. కావున బిసిలంతా ఏకతాటిపైకి వచ్చి టిడిపిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కాగా 18న ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని లలిత కళాపరిషత్‌లో రక్తదాన శిబిరంతోపాటు, సాంస్కృతిక కార్యక్రమాలు, 20న ముస్లిం మైనారిటీ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ సీనియర్ నాయకులు సాలార్‌బాషా, నారాయణస్వామి యాదవ్, సరిపూటి రమణ, దలవాయి వెంకట్ నారాయణ, సిమెంట్ పోలన్న, సుధాకర్‌యాదవ్, డిస్కో బాబు, జెఎం.బాషా, మార్కెట్ మహేష్, పోతుల లక్ష్మీనరసింహులు, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : జయహో బిసి సదస్సును జయప్రదం చేయాలని టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని అర్బన్ టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని 5వరోడ్డు షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద బిసి జయహో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు పోతుల లక్ష్మీనరసింహులు, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గేట్‌వాల్

ప్రజాశక్తి-పామిడి

రహదారి పక్కడే పమాదకరంగా ఉన్న గేట్‌వాల్

పంచాయతీ పరిధిలోని 44వ జాతీయ రహదారి దగ్గరగా ఉన్న అంబేద్కర్ కాలనీకి వెళ్లే ప్రధాన దారికి సమానంగా ఆనుకుని ఉన్న పంచాయతీ వాటర్ గేట్‌వాల్ ప్రమాదకరంగా ఉంది. గేట్‌వాల్ కేవలం మూడు అడుగుల లోతులో ఉండటం వల్ల రాత్రి సమయాల్లో ఆ దారి గుండా వెళ్లే వాహనదారులు ప్రమదాలకు గురవుతున్నారు. ఇప్పటికే పలువురు గాయపడ్డామని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకునే వారే లేకుండా పోయారని కాలనీకి చెందిన జానకిరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జరగరానిది జరగక ముందే ప్రమాదకరంగా ఉన్న పంచాయతీ వాటర్ గేట్‌వాల్‌ను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌ను ప్రజాశక్తి విలేకరి ఫోన్లో మాట్లాడగా గుంతలో ఉన్న గేట్‌వాల్‌కు అదనంగా ప్లాస్టిక్ పైపువేసి గుంత పూడుస్తామని హామీ ఇచ్చారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

గుంతకల్లులో మూకట్లలో గంజి తాగుతున్న అంగన్వాడీలు

రాయదుర్గంలో రొట్టెలు కాలుస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

గుత్తి సమ్మెలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్

ఎస్మా ప్రయోగం దుర్మార్గం

కొనసాగిన అంగన్వాడీల ఆందోళనలు-పలుచోట్ల గంజి తాగి, ముగ్గులు వేసి నిరసన

ప్రజాశక్తి-గుత్తి

అంగన్వాడీలకు వర్తించని ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 36వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా శిశు మరణాల అరికట్టడంలో అంగన్వాడీల కృషి ఎంతో ఉందన్నారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యాన్ని అంగన్వాడీలు కాపాడుతున్నారన్నారు. అలాంటి అంగన్వాడీలు చాలీచాలని వేతనాలతో ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. 2017 నుంచి టిఎ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అంగన్వాడీ కేంద్ర భవనాల అద్దెలు, గ్యాస్ బిల్లులు ఇవ్వడం లేదన్నారు. అంగన్వాడీ జీతాలు పెంచడానికి డబ్బు లేదన్న ప్రభుత్వం ఋషికొండలో నిర్మాణాలకు రూ.కోట్లు వృథా చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సెక్టార్ నాయకురాళ్లు కళ్యాణి, పార్వతి, గంగ, బావమ్మ, శోభ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం ఎస్మా ప్రయోగం చేయడమే కాకుండా సంప్రదాయ పండుగ పూట అంబలి (గంజి) తాగించిన ఘనత సిఎం జగన్‌రెడ్డికే దక్కిందని అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో అంగన్వాడీలు మూకట్లలో గంజి తాగుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రేష్మా, గంగా, నాయకురాళ్లు నాగమణి, జూళి, పార్వతి, మేరి, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కసాపురం రమేష్, సాకే నాగరాజు, నాయకులు చొక్కా సునీల్, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : మండల పరిధిలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారానికి 36వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ కార్యదర్శి మేరీ మాట్లాడుతూ అంగన్వాడీలకు క్రిస్మస్, కొత్త సంవత్సరం, సంక్రాంతి వేడుకలను దూరం చేయడం బాధాకరమన్నారు. పండుగపూట కుటుంబ సభ్యులతో గడపాల్సిన అంగన్వాడీలను రోడ్లపై అంబళి తాగించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్ స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ నాయకులు రాధిక, మెహ్రూన్, చంద్రకళ, రుద్రమ్మ, మల్లమ్మ, అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : అంగన్వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారానికి 36వ రోజుకు చేరుకుంది. వీరికి మద్దతు ప్రకటించిన సిపిఎం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీలు సమ్మె చేపడితే రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్ స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరి, ఎపి రైతుసంఘం నాయకులు జి.వెంకటచౌదరి, వ్య.కా.సం మండల అధ్యక్షులు టి.పెద్దయ్య, కార్యదర్శి బి.భాస్కర్‌రెడ్డి, కెవిపిఎస్ నాగభూషణ్, ఐద్వా మండల కార్యదర్శి టి.రేణుక, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు జయలలిత, అనంతలక్ష్మి, రమాదేవి, శశికళ, సిఐటియు మండల నాయకులు పుణ్యపురుష, వీరరాఘవరెడ్డి, అహ్మద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రంలో ఎస్మా ప్రతులను భోగి మంటల్లో వేసి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

బుక్కరాయసముద్రం : అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా భోగిమంటల్లో నోటీసులు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శింగనమల ప్రాజెక్టు అంగన్వాడీ కార్యదర్శి కాత్యాయని, వ్య.కా.సం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, సిఐటియు మండల కార్యదర్శి నాగేంద్ర, రైతుసంఘం నాయకులు సంజీవరెడ్డి, బుక్కరాయసముద్రం మండల సెక్టార్ నాయకురాళ్లు విమల, సుజాత, రత్నమ్మ, సుభాషిణి, వెంకటలక్ష్మి, గీత, లక్ష్మీదేవి, మండల అంగన్వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : అంగన్వాడీలు చేపట్టిన సమ్మె రాయదుర్గంలో కొనసాగింది. ఇందులో భాగంగా సోమవారం శిబిరం వద్ద పొయ్యి వెలిగించి సజ్జ రొట్టెలు తయారు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 'జగనన్నా.. సంక్రాంతి పండుగ సందర్భంగా మీ ఇంట్లో ఓలిగలు.. మాకు రొట్టెలా..'? అంటూ నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం 36వ రోజు చిన్నపిల్లలకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. తమకు నెలసరి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉరవకొండ : ఉరవకొండ, విడపనకల్, వజ్రకరూరు మండల కేంద్రాల్లో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం కూడా కొనసాగింది. వీరికి వామపక్షాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్లు మధుసూదన్, విరూపాక్షి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చెన్నరాయుడు, అంగన్వాడీ యూనియన్ నాయకులు విజయ, రంగమ్మ, శ్వేతనాగు, సరోజమ్మ, బ్యులా, ధనలక్ష్మి, జ్యోతి, రామంజినమ్మ, లోకమ్మ, నాగమణి, శివశ్రీ, సువర్ణమ్మ, శశికళ, లక్ష్మీదేవి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్టలో సంతకాలు సేకరిస్తున్న అంగన్వాడీలు

ఉరవకొండలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

సిఐటియు కాలనీలో ఆటల పోటీలు

గుంతకల్లు : సంక్రాంతి సంబరాలలో భాగంగా పట్టణంలోని డివైఎఫ్ఐ, సిఐటియు కాలనీ కమిటీ సంయుక్తంగా సిఐటియు కాలనీలో మంగవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా క్రికెట్, షటిల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, స్పూన్‌లో నిమ్మకాయ పెట్టుకుని పరిగెత్తడం, పరుగు పందేలు, డ్యాన్సులు, పాటలు వంటి మొదలగు ఆటలు పాటలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ నాయకులు మారుతీప్రసాద్, చంద్ర, ఓబులేసు, అబ్దుల్లా, ఎస్‌కెఎం బాషా, సూరి, ఖాదర్, డివైఎఫ్ఐ నాయకులు సురేంద్రబాబు, చరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంబరంగా ముగ్గుల పోటీలు

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

పెద్దవడుగూరు : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలోని తిమ్మాపురంలో మై హెల్ప్ యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ ఏటా సంక్రాంతి పండుగ రోజు నిర్వహించే ముగ్గుల పోటీలు మహిళలకు ఎంతో ఆనందాన్ని ఇస్తున్నాయన్నారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

బండిలాగుడు పోటీలు

బండి లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న వైసిపి నాయకులు

ఉరవకొండ : విడపనకల్ మండల పరిధిలోని హంచనహాళ్ గ్రామంలో మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వైసిపి ఆధ్వర్యంలో సర్పంచి పార్వతి కేశన్న సహకారంతో గిరికుడు బండ్లు లాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన ఎద్దుల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వన్నూరుస్వామి, మస్తాన్, గ్రామపెద్దలు,. తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంక్ ప్రారంభం

వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న సర్పంచి లలిత

ఉరవకొండ : మేజర్ పంచాయతీ పరిధిలోని 7వ వార్డు సత్యనారాయణపేటలో నూతనంగా నిర్మించిన మినీ సిస్టం వాటర్ ట్యాంకును సర్పంచి లలిత ప్రారంభించారు. ముందుగా సర్పంచితోపాటు మాజీ ఎంపిపి చంద్రమ్మ, తదితరులు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు ఆసీఫ్, మండల సమన్వయకర్త ఓబన్న, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, టౌన్‌బ్యాంకు ఉపాధ్యక్షులు చంగల మహేష్, కో అప్షన్ సభ్యుడు పామిడి సలీమ్, వార్డు సభ్యుడు శర్మస్, నిమ్మల వెంకట రమణ, ప్రకాష్, పచ్చి రవి, సాధు వెంకటస్వామి, పోసా రామాంజనేయులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలంపాట

గుత్తి : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేషన్ల పరిధిలో పట్టుబడిన వాహనాలకు బుధవారం వేలం నిర్వహించనున్నట్లు సెబ్ సీఐ బి.వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక స్టేషన్ ఆవరణలో నిర్వహించనున వేలంపాటలో ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని కోరారు.

రూ.28 లక్షలు పలికిన టెంకాయల వేలం

గుత్తి : మండల పరిధిలోని బాచుపల్లి గ్రామ సమీపంలో ఉన్న బాట సుంకలమ్మ ఆలయంలో సోమవారం టెంకాయలు విక్రయ హక్కు కోసం వేలంపాట నిర్వహించారు. ఆలయం వద్ద సంక్రాంతి పండుగ నుంచి ఏడాదిపాటు టెంకాయలు విక్రయించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. 11 మంది పోటాపోటీగా వేలంపాట పాడారు. వీరిలో మండలంలోని వన్నెదొడ్డి గ్రామానికి చెందిన మద్దయ్య రూ.28 లక్షలకు వేలంపాటను దక్కించుకున్నారు. గతేడాది రూ.26.10 లక్షలకు వేలంపాట పోయినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కె.రమేష్ నాయుడు, కమిటీ సభ్యులు నరసింహులు, వెంకటరాముడు, రంగస్వామి, వైసిపి నాయకుడు కె.కృష్ణమోహన్ నాయుడు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గొల్లలదొడ్డిలో తాగునీటి సమస్య పరిష్కారం

ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్న జనసేన నాయకులు

బెలుగుప్ప : మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో జనసేన పార్టీ నాయకులు తాగునీటి సమస్యను పరిష్కరించారు. 20రోజులుగా శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో మండల పరిధిలోని నరసాపురం పంచాయితీ గొల్లలదొడ్డి గ్రామంలో తాగునీటి సమస్య నెలకొంది. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ నాయకులు మంగళవారం టాంకర్ ద్వారా నీటిని సరఫరా చేసి సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు కాశంశెట్టి సుధీర్, నాని, తిప్పయ్య, రవికుమార్‌నాయక్, మురళీమోహన్, టిడిపి నాయకులు ప్రవీణ్ నాయక్, అవినాశ్ తేజ, హనుమంతునాయక్, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్మకూరు

సిపిఎం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

మండల కేంద్రంలోని భగత్‌సింగ్ కాలనీలో ఏర్పాటు చేసిన సిపిఎం కార్యాలయాన్ని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24వ సంవత్సరాల క్రితం భూస్వాములతో ఉన్న భూమిని సిపిఎం ఉద్యమాలు చేసి స్వాధీనం చేసుకుని భగత్‌సింగ్ కాలనీని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. పేదలకు స్థలాలు ఇవ్వడంతోపాటు ఇళ్ల నిర్మించడంలో సిపిఎం కీలకంగా పని చేసిందన్నారు. ఇలాంటి కాలనీలో సిపిఎం కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్, ఎన్‌పిఆర్‌డి జిల్లా కార్యదర్శి రామయ్య, రైతుసంఘం మండల కార్యదర్శి రాము, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి జయమ్మ, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి రామాంజినమ్మ, ప్రకాష్, లక్ష్మన్న, కర్రెప్ప, వెంకటేశులు, రాము, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు

ప్రజాశక్తి-అనంతపురం

రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలోని నారాయణపురం గ్రామంలో వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు మంగళవారం వైభవంగా ముగిశాయి. ఈ పోటీలను ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రారంభించారు. రెండు రోజులపాటు నిర్వహించిన పోటీలకు నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. న్యూ కేటగిరి విభాగం బలప్రదర్శన పోటీలో నిర్వహించగా 22 జతలు పాల్గొనగా మొదటి స్థానంలో మామిల్ల సుబ్బారెడ్డి, సి.కొత్తపల్లి కంబైన్డ్ చిట్టిబోయిన భరత్‌కుమార్ యాదవ్ ఎద్దులు, 2వ స్థానంలో నంద్యాల జిల్లా ఎస్.కోత్తూరు బీరం బుల్స్ బీరం సుబ్రమణ్యేశ్వరరెడ్డి ఎద్దులు, 3వ స్థానంలో జమ్మలమడుగుకు చెందిన మహేశ్వర కోల్డ్ స్టోరేజ్ మహేశ్వరరెడ్డి ఎద్దులు కైవసం చేసుకున్నాయి. వీరికి శ్యాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లా కేంద్రం సమీపంలోని నారాయణపురంలో ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతియేటా రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ మహమ్మద్ వసీం, ఉర్దూ అకాడమీ రాష్ట్ర ఛైర్మన్ నదీమ్‌అహ్మద్, డిప్యూటీ మేయర్లు కొగటం విజయ భాస్కర్‌రెడ్డి, వాసంతిసాహిత్య, వైసీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, అనంత లిఖిత్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ హరీష్‌యాదవ్, వైసీపీ బీసీ సెల్ రీజినల్ కోఆర్డినేటర్ బీసీ రమేష్‌గౌడ్, సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ రిలాక్స్ నాగరాజు, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు డాక్టర్ మహేష్

ఆర్టీసీ బస్సు డ్రైవర్లు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మహేష్ సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా సోమవారం రాయదుర్గంలోని ఆర్టీసీ బస్సు డిపో ఆవరణలో మేనేజర్ కె.సురేష్‌కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం అనేకమంది ప్రయాణికులను గమ్యస్థానానికి చేరవేసే ఆర్టీసీ బస్సు డ్రైవర్లు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. ఇందులో భాగంగా తరచూ వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ముఖ్యంగా కంటి పరీక్షలు, బీపీ చెక్ చేసుకోవాలన్నారు. మద్యం తాగరాదన్నారు. డిపో మేనేజర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ ప్రతి సంవత్సరం గతంలో రోడ్డు భద్రత వారోత్సవాలు, అనంతరం పక్షోత్సవాలు నిర్వహించేదన్నారు. అయితే ప్రస్తుతం జనవరి 15వ తేదీ నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం డిపోలో డ్రైవర్లకు శిక్షణ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శరవేగంగా తాగునీటి పైప్‌లైన్ పనులు

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

తుంగభద్ర జలాశయం నుంచి ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల ప్రజలు తాగునీటి కోసం ఎదురుచూస్తున్నారన్నారు. దాహార్తిని తీర్చాలని చెన్నేకొత్తపల్లికి సిఎం జగన్‌కు విన్నవించగా పిఎబిఆర్ జలాశయం నుంచి ఆత్మకూరు మండలానికి, అక్కడి నుండి అనంతపురం రూరల్ మండలం పాపంపేట వరకూ పైప్‌లైన్ నిర్మాణానికి రెండు ప్యాకేజీల కింద రూ.95 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. దీంతో శరవేగంగా పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు నరసింహులు, ఎంపిపిలు, హేమలత వైస్ ఎంపిపిలు, విజయ్ ఎంపిటిసిలు, సర్పంచులు, వరలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, కొండారెడ్డి, ఛైర్మన్లు, డైరెక్టర్లు, మండల నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

యాడికి : స్థానిక కోన రోడ్డు ఆంజనేయస్వామి కాలనీకి చెందిన ఆంజనేయులు (65) మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న ఆంజనేయులు గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో మనస్తాపానికి గురైన ఆంజనేయస్వామి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు.

సెల్‌ఫోన్ చోరీ

నార్పల : మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో నార్పలకు చెందిన మునిరత్నం సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు మునిరత్నం మాంసం తీసుకునేందుకు బస్టాండ్ ప్రాంతానికి వచ్చాడు. అయితే కనుమ సందర్భంగా జనాలతో కిటకిలాడిన మటన్ మార్కెట్‌లో గుర్తు తెలియని వ్యక్తులు సెల్‌ఫోన్‌ను చోరీ చేశారు. గమణించిన మునిరత్నం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. బాధితుడితో వివరాలు సేకరించిన ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు.

బిసాటి భరత్‌కు జాతీయ పురస్కారం

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాకు చెందిన బిసాటి భరత్‌కు జాతీయ పురస్కారం లభించింది. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ యువతకు జాతీయ యువ పురస్కారాన్ని అందిస్తూ ఉంటుంది. ఇందులో భాగంగా మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగిన జాతీయ యువ జనోత్సవాల్లో . పుట్లూరు మండలం కందికాపులకు చెందిన బిసాటి భరత్‌కు యువజన వ్యవహారాలు క్రీడల శాఖ మంత్రి నిషిత్ ప్రమాణిక్ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ తనకు వచ్చిన అవార్డుతో మరింత ఉత్సాహంతో సమాజానికి సేవలు అందిస్తానన్నారు. అలాగే యువత కూడా సామాజిక మాధ్యమాలకు పరిమితం కాకుండా సమాజానికి కొంత సేవలు అందించాలని పిలుపునిచ్చారు.

జాతీయ యువ పురస్కారాన్ని అందుకుంటున్న బిసాటి భరత్

చెరువులో పూడిక తీయాలి

రాయదుర్గం : మండల పరిధిలోని మల్లాపురం చెరువులో పూడిక తీయాలని స్థానికులు, ప్రజాప్రతినిధులు అభిప్రాయడ్డారు. సోమవారం మండలంలోని పల్లేపల్లి గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో రెడ్డిసంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త, న్యాయవాది గౌని ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మల్లాపురం చెరువులో పూడిక తీయడం వల్ల చెరువులో ఎక్కువ మోతాదులో నీరు నిల్వ ఉండే అవకాశం ఉందన్నారు. ఇందుకోసం ఎలాంటి ప్రణాళికలు తీసుకోవాలనే విషయాలను స్థానికుల నుంచి స్వీకరించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపిపి గౌని నాగరాజురెడ్డి, పాటిల్ సదాశివరెడ్డి, మోహన్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.